## మరణిస్తూ.. పలువురికి ప్రాణదానం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 10: తాను మరణిస్తూ.. పలువురికి ప్రాణం పోశారు నిజామాబాద్ జిల్లా వినాయక్‌నగర్‌కు చెందిన ఎడ్ల గోపాల్ (55). టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన..మూడు రోజుల కిందట ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నారు. కుటుంబసభ్యులు సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు.. ఈనెల 9 న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు కుటుంబసభ్యులను కలిసి అవయవదాన విశిష్టతను వివరించగా, అందుకు వారు అంగీకరించారు. గోపాల్ నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు స్వీకరించారు. అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబసభ్యులను జీవన్‌దాన్ ప్రతినిధులు అభినందించారు.



ఆటో డ్రైవర్ నరేశ్ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

## ఆటో డ్రైవర్ కుటుంబానికి.. బండారి ₹50వేల సాయం

మల్లాపూర్, ఫిబ్రవరి 10 : నాచారం దుర్గానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నిమ్మగళ్ల నరేశ్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి నరేశ్ కుటుంబాన్ని పరామర్శించారు. అతడి తల్లిదండ్రులు నిమ్మగళ్ల గోపాల్, జ్యోతిలకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, నాయకులు జె.భాస్కర్, శ్రీనివాస్, పొన్నాల మహేందర్, మూర్తి రాజు, కె.అంజి, దొంతుల శ్రీనివాస్, భూపతి అశోక్ తదితరులు ఉన్నారు.

## గ్రేటర్ ప్రగతికి మొండిచెయ్యి

ఊసే లేని మెట్రో విస్తరణ, ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ ప్రాజెక్టులు

మూసీ అభివృద్ధికి రూ. 1000కోట్లతో సరి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ) : అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరానికి మరిన్ని హంగులను సమకూర్చుతుందని భావించిన గ్రేటర్ ప్రజానీకానికి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో మొండి 'చెయ్యి' చూపించింది. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ వంటి రెండో దశ కీలక ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. మెట్రో విస్తరణ ఊసే లేదు. పురపాలక శాఖ మొత్తానికి రూ.11,692 కోట్లను కేటాయించగా..హైదరాబాద్ అభివృద్ధిలో కీలక శాఖలైన జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మెట్రో, జలమండలికి సంబంధించి కేటాయింపులపై స్పష్టత ఇవ్వలేదు. జీహెచ్ఎంసీ వివిధ ప్రాజెక్టులకు రూ. 3600కోట్లు, జలమండలి రూ. 5595 కోట్ల మేర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఇందులో మూసీ అభివృద్ధికి మాత్రమే రూ. 1000 కోట్లు కేటాయించారు. ఇక మెట్రో విస్తరణపై పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లారు. ప్రజోపయోగంగా మెట్రోను తీర్చిదిద్దుతామంటూ తెరమీదకు తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనలను పక్కన పెట్టారు.

## ఎక్స్‌టెన్షన్‌పై బల్దియా వేటు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఆదేశాల మేరకు బల్దియాలో పదవీ విరమణ పొంది ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతున్న అధికారులను ఇంటికి పంపించే ప్రక్రియ కొనసాగుతున్నది. తాజాగా హౌసింగ్ విభాగం ఓఎస్డీ సురేశ్‌కుమార్‌ను పంపించారు. ఈ స్థానంలో ఐఏఎస్ అధికారి శివకుమార్ నాయుడుకు బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ విభాగం జాయింట్ కమిషనర్‌గా ఉన్న కెనడీని ఈ బడ్జెట్ సమావేశాల అనంతరం పంపించేందుకు చర్యలు చేపట్టారు. ఈ స్థానంలో ఎస్టేట్ విభాగం అదనపు కమిషనర్‌గా ఉన్న గీత రాధికకు అదనంగా ఫైనాన్స్ బాధ్యతలు అప్పగించారు. మరో రిటైర్డ్ అధికారిణి అనురాధ వచ్చే నెలాఖరు వరకు మాత్రమే కొనసాగనున్నారు.



శనివారం తెలంగాణభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానంద్, గాంధీ, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ తదితరులు

# 60 రోజుల పాలన అటెన్షన్.. డైవర్షన్

ఫార్మాసిటీ రద్దు చేసి.. మెట్రో విస్తరణ ఆపి.. ప్రగతికి ప్రభుత్వం అడ్డు

అభివృద్ధి దెబ్బ తింటే.. రాష్ట్రానికి రాబడి, రెవెన్యూ తగ్గే ప్రమాదం

భారీ ప్రాజెక్టులను రద్దు చేస్తే తీవ్ర నష్టం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లతో సమావేశం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రాజకీయ దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగర అభివృద్ధిని అడ్డుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. 60 రోజుల కాంగ్రెస్ పార్టీ పరిపాలన అంతా అయోమయంగా ఉన్నదని విమర్శించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టకుండా, కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే అటెన్షన్ డైవర్షన్ ప్రయత్నాలను ప్రజలు ఎక్కువ రోజులు నమ్మరని కేటీఆర్ అన్నారు. ఫార్మాసిటీ, మెట్రో విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులను రద్దు చేయడం వల్ల రాష్ట్ర అభివృద్ధి దెబ్బతినే అవకాశమున్నదన్నారు. అభివృద్ధి దెబ్బ తింటే.. రాష్ట్రానికి రాబడి, రెవెన్యూ తగ్గే ప్రమాదం ఉందన్నారు. పదేండ్లలో ప్రతి రోజూ పార్టీ కార్పొరేటర్లు ప్రజల్లోకి వెళ్లి.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యేలా చూశారని కేటీఆర్ అన్నారు. ప్రతి ఒక్క కార్పొరేటర్, పార్టీ శ్రేణులు చేసిన కృషితోనే హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయగలిగిందన్నారు. ఎమ్మెల్యే టికెట్లు ఆశించి రాజకీయ కారణాలతో అవకాశం రాకున్నా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేశారని కేటీఆర్ కొనియాడారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం ఉన్న విస్తృత అధికారాలను ఉపయోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులను ఎదుర్కొనే ప్రయత్నం చేయాలన్నారు. ప్రజలచేత ఎన్నికైన కార్పొరేటర్లు తమకున్న అధికారాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

### కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి

**- ఎమ్మెల్యే తలసాని**

పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసిందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అన్ని రంగాల్లో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించిందన్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా తమ తమ డివిజన్లలో ప్రజలతో కలిసి పని చేద్దామని తలసాని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అడ్డగోలుగా హామీలను అమలు చేయడం అసాధ్యమని, ఇప్పటికే ఆ పార్టీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొన్నదని తలసాని చెప్పారు.



> అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టకుండా, కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే అటెన్షన్ డైవర్షన్ ప్రయత్నాలను ప్రజలు ఎక్కువ రోజులు నమ్మరు. ఫార్మా సిటీ, మెట్రో విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులను రద్దు చేయడం వల్ల రాష్ట్ర అభివృద్ధి దెబ్బ తినే అవకాశమున్నది.
>
> - కేటీఆర్

### జీవితాంతం నిబద్ధతతో పనిచేస్తా

**- మేయర్**

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్ ప్రజల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అజెండా కోసం నిర్వహిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి వల్లే అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించడం లేదని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అధికారుల ఒత్తిడిని, వారి పరిమితులను అర్థం చేసుకోగలుగుతామని, కానీ ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నగర అభివృద్ధిని అడ్డుకోవద్దని చెప్పారు. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలు, జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించే అంశాన్ని నిర్ణయించడం కోసమే ముఖ్యమంత్రిని కలిశానని స్పష్టం చేశారు. తెలంగాణ కోసం రాష్ట్ర ప్రయోజనాల కోసం 1969 నుంచి కొట్లాడిన కుటుంబం తమదని, ఒక సాధారణ కార్పొరేటర్‌గా ఉన్న తనను మేయర్‌గా గొప్ప అవకాశం ఇచ్చిన పార్టీ కోసం జీవితాంతం నిబద్ధతతో పనిచేస్తానని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.



### హామీలు నెరవేర్చకుంటే.. ప్రజా ఉద్యమమే

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో నెరవేర్చకుంటే.. ప్రజా ఉద్యమాన్ని నిర్మిద్దామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లో శనివారం జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఆశించేది చిల్లర మాటలు, డ్రామాలు కాదని, ఇచ్చిన 420 హామీలు ఎప్పుడు నెరవేర్చుతారో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ జల హక్కులను కృష్ణా బోర్డుకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న నల్గొండలో పెద్ద ఎత్తున సభ నిర్వహిస్తున్నామని, హైదరాబాద్‌లో ప్రతి నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని కేటీఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, దానం నాగేందర్, పద్మారావు గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, పాడి కౌశిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 19న జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ) : ఉత్కంఠకు తెరపడింది. జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశానికి ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. ఈ నెల 19న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సమావేశంలో జీహెచ్ఎంసీ బడ్జెట్‌పై విస్తృత చర్చతో పాటు శానిటేషన్, వీధి లైట్ల నిర్వహణ, వీధి కుక్కల బెడద, నాలా సమస్యలు, డబుల్ బెడ్రూం ఇండ్ల సమస్యలపై కార్పొరేటర్లు గళం విప్పేందుకు సిద్ధమవుతున్నారు.

## బ్యాగులో పైసలు ఉంచండి

రేపు తెరిచి చూడండి

బంజారాహిల్స్: నరదృష్టి పోగొట్టే పూజలు చేస్తామంటూ.. ఓ మహిళను నమ్మించి నగదుతో ఉడాయించారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రోడ్ నం. 7లో ఉంటున్న ఓ మహిళ ఇంటికి శుక్రవారం ఇద్దరు మహిళలు వచ్చారు. తాము రోడ్ నం. 4లోని ఎల్లమ్మ ఆలయం నుంచి వచ్చామని, ఆలయం కోసం చందా ఇవ్వాలని కోరారు. దీంతో కొంత డబ్బును చందాగా ఇచ్చిన సదరు మహిళతో మాటలు కలిపిన ఆ ఇద్దరు మహిళలు.. 'మీకు నరదృష్టి చాలా ఎక్కువగా ఉంది. దాన్ని తొలగించాలంటే నిమ్మకాయలు, ఎండుమిర్చి, ఉప్పు, బియ్యంతో పాటు ఇంట్లోంచి లక్ష రూపాయల నగదు బ్యాగ్‌లో పెట్టుకుని రావాలి' అంటూ..సూచించారు. దీంతో ఆమె రూ.70వేల నగదుతో పాటు ఇతర సామగ్రిని బ్యాగులో పెట్టారు. పూజ చేసినట్లు నటించిన ఇద్దరు..బ్యాగులో ఉన్న వస్తువులను మరుసటిరోజు తెరిచి చూడాలని, అప్పటిలోగా నరదృష్టి మొత్తం పోతుందని చెప్పి వెళ్లిపోయారు. కాసేపటికి అనుమానం వచ్చి బ్యాగ్ తెరిచి చూడగా, డబ్బులు కనిపించలేదు. అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి..దర్యాప్తు చేపట్టారు.





## సీఎంఆర్.. మరో ఫ్యామిలీ మాల్

మియాపూర్, ఫిబ్రవరి 10 : తెలంగాణలో ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ స్వర్ణ, వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ మరో మాల్‌ను కస్టమర్ల కోసం అందుబాటులోకి తెచ్చింది. శనివారం కూకట్‌పల్లిలో(కేపీహెచ్‌బీ పిల్లర్ నం. 771) వద్ద ఏర్పాటైన సీఎంఆర్ ఫ్యామిలీ మాల్‌ను నటి శ్రీలీల ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. శ్రీలీలను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఆమెతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ నూతన షాపింగ్ మాల్ ద్వారా మరో 300 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు సీఎంఆర్ అధినేత అల్లక సత్యనారాయణ తెలిపారు.





### రేపు బల్దియాలో ఫోన్ ఇన్ కాల్.. 040-2322 2182

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ): ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రజావాణి సందర్భంగా సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శనివారం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు 040-2322 2182 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. సర్కిల్, జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని తెలిపారు.

# పాటతో ఓ సాయంకాలం



పుస్తకావిష్కరణలో పాల్గొన్న హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రచయిత సుద్దాల అశోక్‌తేజ, కవి జయరాజ్, ప్రొఫెసర్ కాశీం, విమలక్క తదితరులు



శనివారం బుక్‌ఫెయిర్‌లో సందర్శకుల సందడి

## బుక్ ఫెయిర్‌లో పుస్తకావిష్కరణలు

వీకెండ్‌తో భారీగా సందర్శకులు

అలరించిన సాహిత్య కార్యక్రమాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన సందడిగా సాగుతున్నది. వీకెండ్ కావడంతో శనివారం తమకు ఇష్టమైన పుస్తకాలను కొనుగోలు చేసేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. 365 స్టాళ్లు కలియ తిరుగుతూ నచ్చిన పుస్తకాలను కొన్నారు. ముఖ్యంగా పిల్లలు సాహిత్యం, ఆధ్యాత్మికత, ఉమెన్ సక్సెస్ స్టోరీలు, చట్టాలు, పిల్లల కార్టూన్ పుస్తకాలు వంటివి అధికంగా కొనుగోలు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. మరోవైపు నోరూరించే వంటకాలు సైతం అందుబాటులో ఉండటంతో పుస్తక ప్రియులు ఆహారప్రియులుగా మారి నచ్చిన రుచులను ఆస్వాదించారు. మరోవైపు బుక్ ఫెయిర్‌లోని రవ్వా శ్రీహరి వేదికపై జరిగిన సాహిత్య కార్యక్రమాలు అలరించాయి.

### గులాబీల మల్లారెడ్డి రచనలు..

రవ్వ శ్రీహరి వేదికపై శనివారం సాయంత్రం 5 గంటలకు గులాబీల మల్లారెడ్డి రచనలు 'పాలపిట్ట ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ జరిగింది. ప్రేమ పవనాలు-మానవతా సౌరభాల నవలను అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించగా, ఐదుతరాలు కథల పుస్తకాన్నీ డా.కాంచనపల్లి గోవర్ధన్ రాజు, పాలపిట్ట ప్రత్యేక సంచికను డా.ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేముల ప్రభాకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### గద్దర్ యాదిలో..!

పాటతో ఓ సాయంకాలం పేరుతో గద్దర్ సంస్మరణ సభ జరిగింది. హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్, డా. పసునూరి రవీందర్ అధ్యక్షతన గద్దర్ పోరాట జీవితంపై ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, జయరాజు, విమలక్క, ఏపూరి సోమన్న, ప్రొఫెసర్ కాశీం ప్రసంగించారు.